# రైటర్ ఎడిక్ట్



**ఎ.సి రూములో యుఫోమ్ పరుపుపై బోర్లా పడుకుని గుండెల క్రింద దిండు ఉంచి, గడ్డం క్రింద చేతులుంచుకుని, అభిమాన రచయిత 'రాగం' రచనలో లీనమైన పదహారేళ్ళ పరువంలో 'పల్లవి' అనురాగం పలికించలేని రాగం రచనలు— పల్లవికి పంచప్రాణాలు.**

వెన్నముద్దల మెత్తదనం..
సన్నజాజుల సౌకుమార్యం...
వెన్నెలమ్మ చల్లదనం...
సంపంగుల కమ్మదనం...
తేనెలమ్మ తియ్యదనం....

ఇవి రాగం కలానికి అందనివి— పల్లవి ఊహలు వీడనివి. అందం అందాన్ని ఆకర్షించడం సర్వసహజం. కాని పల్లవి రాగాన్ని ఆకర్షించడం విశేషం. రాగంలోని యువకరక్తం సెగలుకక్కేది— అట్టడుగు బడుగు వర్గాల దిగులు సంఘ సంస్కరణాంశాలు అతని కరుకు చేతుల్లో సమాజానికి కాగడాలైన జాగృతి గీతాలు. రాగం గుండె లోతుల్లోని చురకత్తులు— రాజకీయ నాయకుల ఎదల్లో గాట్లు పెట్టి నెత్తుటికాలువలు ప్రవహింపచేసే బాకులు. రొమాన్స్‌లో మునిగి తేలవలసిన ప్రాయంలో రాగం కలంలోని యువకరక్తం శ్రీ శ్రీకి పునర్జన్మ నిస్తూ ఆక్రోశిస్తోంది. రాగంమీటే తీగ ఆలాపించేది ఆవేదన, ఆవేశం, ఉద్రేకం. రైలింజను కూతల్లాంటి ఆ గావుకేకలు విన్నప్పుడల్లా పల్లవి గుండెల మీదకు గుప్పెడు సన్నజాజులు జారిన ధ్వని.. తెల్లవారు ఝాము గులాబీ రేకులపై మంచుబిందువులు చూసినప్పటి పులకరింత...

సాయంసంధ్య మంద్రస్థాయి సంగీతం విన్నప్పటి తన్మయత్వం.. వేకువ ఝాము తిరుపతి కొండపై శ్రీ వెంకటేశుని మేల్కొలుపు సుప్రభాతం లాంటి ప్రశాంతత...

పూర్ణిమనాటి ముగ్ధమనోహర చంద్రయ్య పెట్టే చక్కిలిగింతలు...

కల్మషమెరుగని మొగ్గల్లాంటి పసిపిల్లల బోసినవ్వుల అమృతధారలిచ్చే తాదాత్మ్యం...

అపోజిట్ పోల్స్ ఎట్రాక్ట్...

నిజమే.

అందుకే పల్లవి రాగాన్నాకర్షించింది.

ఊహల జగత్తులో, తారల నడుమ స్వప్నలోకాల్లో విహరించే పల్లవి స్పందనకు వాస్తవపు బురదనీటిలో ఈదులాడే రాగం ప్రతిస్పందించక తప్పలేదు.

పల్లవి రాగం అని మాని...
దారిద్ర్యం— కల్లోలం
వరదలు—వడగళ్ళు
హత్యలు—అరాచకాలు
మతకల్లోలాలు—యుద్ధాలు
నక్సలైట్ల మారణ హోమం— పోలీసుల కసాయి జులుం

నవరసాల్లో వీర భయానక, బీభత్స రౌద్రాద్భుతాలే తన పథంగా సాగే రాగం కలానికి పల్లవి శృంగారం నేర్పింది.

ఓ పాఠకురాలిగా ముచ్చటైన ఆమె ప్రియవచనాలు రాగంరచనల్లో ఈస్థటిక్ విలువల అవసరాన్ని స్ఫురింపజేశాయి. ఏడో ఏట కలం పట్టి, పదహారేళ్ళ రచనానుభవంతో, తనదైన ప్రత్యేక బాణిలో

పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాం, పోదాం పైపైకి

అంటూ సాగిపోయే కలం మార్గం మార్చింది.

పరిసరాల పరిశీలనలో జీవితాన్నంతటినీ కాచి వడబోసిన ఎంతో ఎదిగిన
ఎన్నో చదివిన,
రాగం



ఇప్పుదు సాహిత్యసంద్రంలో పల్లవి లేఖల ఆసరాతో తప్పటడుగులు వేస్తూ శృంగార రసంలో అలలు దిద్దడం ఆరంభించాడు. నాణానికి బొమ్మా బొరుసుకు మల్లే జీవితానికి రెండు ప్రక్కలున్నాయని, ఒక వైపు మ్రగ్గిపోతున్న రాగాన్ని రెండవ ప్రక్క రసమయ ప్రపంచంలోకి నడిపించాయి పల్లవి లేఖలు. కరుకు అనుభవాలతో తుప్పుపట్టిన రాగం హృదయపు ఇనప కవాటాలు తెరుచుకుని, చొచ్చుకుపోయి, ప్రేమ సామ్రాజ్యాన్ని స్థాపించాయి పల్లవి లేఖలు. అశ్లీలానికి తావీయని రాగం వ్రాతలో 'ప్లాటనిక్ లవ్' పరవశమై పరవళ్ళు త్రొక్కింది. మనసుకు అనుభవమైతే గానీ ఆలోచననీయనని మొరాయించింది రాగం మెదడు.

పర్యవసానం..

పల్లవి లేఖలపై రాగం పెంచుకున్న అనురాగ లతల బంధం. అతని కలం నుండి శ్రీ శ్రీ నిష్క్రమించి, కృష్ణశాస్త్రికి ప్రవేశమిచ్చాడు. ఇప్పుడతని కలం నాయికానాయకులే ఆలంబన విభావంగా మలయానిల చంద్రాదులే ఉద్దీపన విభావములుగా రత్యాదిస్థాయి భావములతో శృంగార రసమయ గానం ఆలాపిస్తోంది. ఆ ఆలాపనకు పునాది పల్లవి లేఖల్లో అమరాగం. ఆ అనురాగానికి మధ్య భౌతిక దూరం పదహారు వేల మైళ్ళు. వారి మేఘ సందేశాలందించే రాయబారులు తపాలా శాఖలు. ఓ ఋతుకాలం తపాలాశాఖ పోషణ భారం నెత్తిన వేసుకున్నారు రాగ పల్లవులు. పాఠకురాలి నుండి ప్రియురాలి తరుణంలో అంతరాయం.

కారణం

తపాలా శాఖ వారి అలసత్వం కాదు. రసమెరుగని రసాయనశాస్త్రజ్ఞుడితో మూడుముళ్ళు వేయించుకుని విదేశాల వెళ్ళిపోయిన పల్లవి.

కలం స్నేహమే ఎంటర్‌టేనింగ్ హాబీ..

ఓ సుప్రసిద్ధ రచయితతో కలం స్నేహంలో థ్రిల్లు.. రచయిత వ్యక్తిత్వాన్నే గతితప్పించిన

## ఆమె ఉత్తరాల 'పల్లవి'
## పాడితే అతనిలో అను 'రాగం' అంకురించింది.
## జీవితంలోని కరకు అనుభవాలనుంచి
## రసమయ ప్రపంచంలోకి నడిచాడతను...
## ఆ పయనం ఎందాకా?

గా రాగం మదిలో ఎదిగిన పల్లవి అతని వ్రాతలకందని అవ్యక్తానుభూతుల భూతల స్వర్గం. రోగికి టానిక్కులా రాగానికి పల్లవి లేఖ. డ్రగ్ ఎడిక్టులపై సంచలనాత్మకమైన రచనలు చేసి మన్ననలందుకున్న రాగం నేడు పల్లవి లేఖల ఎడిక్టు. ప్రతి రెండో రోజున, తపాలాశాఖ వారి అశ్రద్ధకు గురై, ప్రత్యేకమైన గులాబీ రంగు పత్రం ఆలస్యమైతే రాగం మతి గతితప్పి భ్రమణం పొంది

ఉన్మాదానికి అతిచేరువై పలవరిస్తుంది. అయితే లేత గులాబీ రెపరెపలాడే పత్రం వెనుక అదృశ్య హస్తం... రతీదేవిని తలదన్నే సుందర రూపంతో పరిచయం లేదు రాగానికి. రాగాన్ని స్పందింపజేసి, అతని ప్రపంచాన్నే మార్చింది. పరిచయం లేని ఆ మోహనరూపం కాదు. రసస్ఫటికల్లాంటి ఆమె చేతి వ్రాతలు. పల్లవి లేఖలే రాగం ఊపిరి. పల్లవే రాగం ఊహాగానాల వెనుక స్ఫురణ — ప్రేరణ.

ఆ లేఖలే రాగం ఊపిరి. పల్లవే రాగం ఊహాగానాల వెనుక స్ఫురణ— ప్రేరణ ఆ లేఖలు రేపే ఊహల సాగరంలో

అగ్ర తాంబూలాన్నందుకున్న శృంగార రసాన్ని మథించిన రాగం, తనివితీరా జుర్రుకుంటున్న గర్వం...

రాగం మనస్తత్వంలో కలవరింత కలిగించిన గెలుపు...

ఆ ఆనందంతో అమెరికాలో పల్లవి. నదీతీరాల్లో , చెట్లల్లో పుట్లల్లో, కొండల్లో, కోనల్లో. తన ప్రియురాలి లేఖల ఆలంబన కరువయి ప్రేరణలేని భావాలకు, భాషకు సామరస్యం కుదరక నిస్సత్తువలో మెదడు మొద్దుబారి...

కలం ముందుకు సాగక

బుర్రంతా శూన్యంగా మిగిలి

ఆ శూన్యం నుండి వైరాగ్యం

ఆపైన నిర్లిప్తత

నిర్లిప్తతలో ఓ కంటకన్నీరు— మరో కంట వెర్రి ఆనందం

నవ్వుతూ

రోదిస్తూ

ఏడుపుల్లో నవ్వుని మిళితం చేసి

నవ్వులో కన్నీటిని చేర్చి

సర్వరసాల సమ్మేళనానుభూతి 'రసన' అయితే

మరి ఆ లెటర్ ఎడిక్ట్‌లోని అనుభూతి ఏ రచయితకలానికి అందుతుంది? ●

**కొప్పిసెట్టి ఝాన్సీరాణి**